ఓ నేస్తమా !
ఇంద్రధనస్సును చూడు కనిపించి మాయమవుతుంది.
పువ్వును చూడు వికసించి వాడిపోతుంది.
మేఘాన్ని చూడు గర్జించి అదృశ్యమవుతుంది.
నీ జీవితం ఇలా కాకూడదు.
ఇంద్రధనస్సులా అందరిని ఆకర్షించాలి.
మేఘంలా అందరికి ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని ఇవ్వాలి.
పువ్వులా అందరికీ నీ యొక్క పరిమళాన్ని చూపించాలి.
చివరకు అందరి మదిలో నిలిచిపోవాలి
అదే నీ జీవితం యొక్క ఆశయం కావాలి.

## స్నేహం

డి.యస్.యస్. కృష్ణా, AEM - 09



విరబూసిన మల్లెలతో పోల్చుదామంటే ఆ పరిమళం ఒక్కరోజు
నిండు చంద్ర కాంతితో పోల్చుదామంటే
ఆ కాంతి పక్షం రోజులు మాత్రమే
మధురమైన వసంతకాలంతో పోల్చుదామంటే వెంటనే వచ్చే గ్రీష్మ ఋతువు
చక్కని సంగీతంతో పోల్చుదామంటే స్వరాలన్ని వెదకినా కనపడలేదు
మన స్నేహంగా అందుకే నే నిర్వచిస్తున్నా
ఏ ఉపమానాలకు అందని ఉపమేయం మన స్నేహం అని
జీవన సెలయేరు ఎన్ని మలుపులు తిరిగినా....
చిరునవ్వుల గలగలలే మన చెలిమికి చెరుగని చిరునామా

# సుందర స్వప్నం

యస్. సతీష్, యస్.పి-26



ఒక నడి నిశిలో సుందర స్వప్నాలలో విహరిస్తున్న నన్ను
మేల్కొల్పింది ఒక వెలుగు
కళ్ళు తెరచి చూసిన నాకు
ఆ వెలుగు ఏదో దారి చూపించింది
ఆ దారిలోనే సాగుతున్న నాకు
ఆ వెలుగులో ఎన్నో అందాలు కనిపించాయి
అందమైన పూదోటలు
గలగలమంటూ పారే సెలయేఋలు
ఆ వెలుగులో నాకు కనిపించాయి
ఎన్నో ప్రకృతి సౌందర్యాలు
ఉప్పొంగిన మనస్సుతో నేను
నా భావాలు ఆ వెలుగుతో పంచుకున్నాను.
ఆ వెలుగులో దర్శనమిచ్చాయి నాకు
ప్రణయకాంతులు
ఆ వెలుగులోనే దర్శనమిచ్చాయి నాకు
జీవితపు మధుర ఘట్టాలు
కరిగిన మనస్సుతో నేను, మళ్ళీ
నా భావాలు ఆ వెలుగుతో పంచుకున్నాను
నేను చూసిన స్వప్నాల కంటే
ఆ వెలుగే అద్భుతంగా కనిపించసాగింది నాకు
ఇంతలో ఒక్కసారిగా ఆ వెలుగులోనే
నాకు కనిపించింది
తిలక్ చూసిన అమృతం కురిసిన రాత్రి
ఆ వెలుగులోనే నాకు కనిపించింది
శ్రీశ్రీ మహాప్రస్థానం
ఆ వెలుగులోనే నేను చూశాను
జాషువ పెంచిన గబ్బిలాన్ని
కదిలిన హృదయంతో నేను తిరిగి
నా భావాలు ఆ వెలుగుతోనే పంచుకోవాలనుకున్నాను
అంతలోనే నాకు గుర్తుకొచ్చింది
వారందరిని మేల్కొల్పింది కూడా ఆ వెలుగేనని, కాని
ఎందుకో నాకు ఆ వెలుగులో నేను
చూసిన వాటికంటే, మేలనిపించాయి
చీకటిలో నేను చూసిన స్వప్నాలు
ఇంతలోనే ఆ వెలుగు మాయమయ్యింది
తిరిగి నన్ను చీకట్లు ఆవరించగా
మళ్ళీ సుందర స్వప్నాలలో విహరించసాగాను
కాని నేను తెలుసుకోలేకపోయాను
ఆ చీకటి అనంతమైనదని
ఇంక ఏ వెలుగు
నన్ను మేల్కొల్పలేదని.

# జాబిలమ్మ పదాలు

(కీర్తిశేషులు ఆరుద్ర గారికి కృతజ్ఞతలతో....)

డి. నాగేశ్వరరావు, హిందీ శాఖ.



1. కులము - మతములు ఏల,
విద్యనొసగును చాల,
మా ఆంధ్రా లొయోల,
ఓ జాబిలమ్మ !

2. క్రీస్తు చరితను చూసి,
సమరమంటే రోసి
మారెనదె 'ఇన్యాసి'
ఓ జాబిలమ్మ !

3. మనసు ఊరే నుయ్యి,
కవిత చేదగ వెయ్యి,
భావ జలములు తియ్యి,
ఓ జాబిలమ్మ !

4. అమృత భాండము జారె,
భువిని భాషగ మారె,
'తెలుగు' గా అలరారె,
ఓ జాబిలమ్మ !

5. 'కులము - మత' మని అనకు,
'గుణమె గొప్ప' ని పలుకు,
అదియె మంచిది మనకు,
ఓ జాబిలమ్మ !

6. ప్రేమ వృక్షమును పెంచు -
కరుణ ఫలము కాయించు -
పదిమందికీ పంచు -
ఓ జాబిలమ్మ !

7. సునామీ - విధి వ్రాత !
పుడమి గుండెకు కోత !
తల్లడిల్లెను జనత !
ఓ జాబిలమ్మ !



# ఆశ.. ఆశ.. ఆశ..

యమ్. నరేష్ కుమార్, డి.నెం : డి.జెడ్. 10

నీవెవరివో తెలీదు కాని
నీతో మాట్లాడాలనే ఆశ.

నిన్నెన్నడు చూడనే లేదు కాని,
నా స్వప్నాల్లో నిన్ను చూడాలనే ఆశ.

నీ మనసెలాంటిదో తెలీదు కాని,
నా మనసులో నిన్నుంచాలనే ఆశ.

నీ అభిరుచు లెలాంటివో తెలీదు కాని,
అవి నా అభిరుచులతో ఏకమవ్వాలనే ఆశ.

నీ ఆశ నెరవేరాలనే నా ఆశ కాని,
నా ఆశ ఫలిస్తుందో లేదోనన్న నిరాశ

నా జీవితాన్ని నీతో పంచుకోవాలనే ఆశ

ఆ ఆశతోనే గడుపుతున్నాను ప్రతినిశ

నీ రాక కోసం వేచి వుంటాను అహర్నిశ

ఆశతో.. !
నీ ఆశానేస్తం

# నీ కోసం

కె. పూజా, ఎ.బి.జడ్. 5



ఒక మేఘంలా నన్ను చేరావు
నాలో ఎన్నో ఆశలు రేపావు
రంగు రంగుల కలల్లో ముంచావు
ఇంతలోనే పిడుగులు కురిపించావు
నా మనసును ముక్కలు చేశావు
కనులు తెరచి చూసేలోపు కనుమరుగయ్యావు
ఎందుకు నన్ను పిచ్చిదాన్ని చేస్తావు
న్యాయమా ఇది నీకు.

జీవితంలో ఏదో తక్కువయింది
అది నీ ప్రేమ అని తెలిసింది
నా కంటిలో వెలుగున్నంతవరకూ
నిన్ను ఆరాధిస్తూనే ఉంటాను

కాస్తయినా దయ లేదా నాపైన
మరపురానీక మరచిపోనీక ఎన్నాళ్ళిలా
దగ్గరే ఉన్నా దక్కవు కనుక
దరిచేరే మార్గం లేదు కనుక
అలజడి నాలో రేపిందిచాలిక
రగిలిన మనసును ఇంకా కాల్చక
వెంటాడి వేధించడం ఆపవా ఇక
ఆటలు నాతో ఆడింది చాలిక

# కల

ఆర్. భరద్వాజ, ఎన్.ఒ. 16

అందమైన రూపంతో
నీవు నా ముందరున్న సమయానా,

చెన్నగు చెక్కిళ్ళతో
నీవు నా చెంత చేరిన నిమిషానా,

మధుర కంఠంతో
నీవు నాతో మాట్లాడిన సమయానా,

చల్లని చంద్రుని కాంతితో
నీవు నా చెంత నడిచిన నిమిషానా,

వేకువ జామున
నీ మధుర స్మృతులు చెదిరిన సమయానా,
నేనెందుకు ఈ ప్రపంచానా.



# అందం

డి. ప్రవీణ్ కుమార్, యస్.ఇ.యం. 9

నింగికి జాబిల్లి అందం
నేలకి లత అందం
లతకి పువ్వు అందం
పువ్వుకి తుమ్మెద అందం

సాగరానికి కెరటాలు అందం
ముత్యపు చిప్పకు ముత్యం అందం
వసంతానికి కోయిలపాట అందం
పల్లెటూర్లకు పచ్చటి పొలాలు అందం

ఆకాశానికి పక్షులు అందం
పౌర్ణమికి కమ్మని వెన్నెల అందం
కొలనుకు కలువ పువ్వులు అందం
అడవికి పశుపక్ష్యాదులు అందం.

పాపాయిలకు బోసినవ్వులు అందం
చిన్న పిల్లలకి బుడిబుడి నడకలు అందం
ఆడపిల్లకి అలంకారం అందం
మగపిల్లవాడికి గుణం అందం

మనిషికి మంచి మనస్సు అందం
మనస్సుకు చక్కని భావాలు అందం
చక్కని భావాలకు ఆచరణ అందం
భావాల ఆచరణ విజయవంతమైతే అందం, ఆనందం

పరిశ్రమలకు కార్మికులు అందం
రాజకీయవేత్తలకు సక్రమమైన పాలన అందం
ఉపాధ్యాయునికి విద్యాబోధన అందం
విద్యార్థికి చదువు అందం

భారతదేశానికి తలలాంటి కాశ్మీర్ అందం
ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ అందం
విజయవాడకు కాలేజీలు అందం
Loyola College కి విద్యార్థులు అందం
అందానికి అందం దేవుని సృష్టి అందం.

# రథసారథులు

డి.వి.కె. యశశ్రీ, ఎస్.పి. 45



జన్మలలో ఉత్కృష్టమైనది మానవజన్మం
జీవితంలో అందమైనది చిన్ననాటి బాల్యం
శ్రీమంతులకిది సుమధర పరిణామం
పేదవానికిది దుర్భరమైన చేదు జ్ఞాపకం

తోటి పిల్లల చదువుల సంబరాలు చూస్తున్న
తమ చిట్టిపొట్టి చేతులు సహకరించకున్న
రెట్టింపు భారాన్ని భరిస్తున్న కాలి అందెలు కదలకున్న
విధి సమ్మెట దెబ్బలతో గుండె బండబారుతున్న
ఆకలి కొరడా తన కాయాన్ని తూట్లువేస్తున్న
యజమాని తన రక్తమాంసాల్ని పీల్చిపిప్పిచేస్తున్న

జీవితపయనం మొదలెడతారు చిన్ననాటినుండి
వెన్ను కంటిన ఆహారంలేని కడుపు మండి
ఆదేకాని, అతంలేని జీవనసమరాన్ని చేయుటకై
తనే ఆధారమైన కుటుంబ సభ్యుల "క్షుధార్తి" నివృత్తికై

ఉవ్విళ్ళూరుతాడు చేరాలని తల్లి ఆలింగనం
పాపం పిల్లవాడి కర్తవ్యం మాత్రం ధనసంపాదనం
నేటి "బాలలే రేపటి పౌరులు" ఇది "చాచా" స్వప్నం
కాని "నేటి బాలకార్మికులు రేపటి అసాంఘికశక్తులు" ఇది నిజం

వేలకు వేలు పెట్టి చేయనక్కరలేదు బాలలదినోత్సవాలు
కల్మషమెరుగని పసిమొగ్గలకు చిన్న ఆదరణ చాలు
అక్కరలేదు, పనికిరాని, విలువలేని పథకాలు
వారి ప్రతిభను గుర్తించి నేర్పాలి చదువులు
సంపాదించిన జ్ఞానమే వారి భవితకు పునాదులు
నేటి బాలలే రేపటి "భావిభారత రథసారథులు"



# యువతరం

కొమ్మనబోయిన వెంకట్రావు, డి.ఇ.టి. - 17

యువతరం కదలాలి
యువతరం ముందుకు కదలాలి
యువశక్తిని మేలుకొల్పాలి
యువతేజం ఉట్టి పడాలి
అవినీతి సమాజ అవతారం మార్చాలి
సమ సమాజ అవతరణకు కృషి జరపాలి
అన్ని రంగాలయందు అగ్రస్థానం కలిగి
నేటి యువతరం రాబోవు తరాలకు
కావాలి ఆదర్శప్రాయం

ఏ పని అయినా యువతతో సాధ్యం
పట్టుదల ఆయుధంగా
కార్యదీక్ష మార్గంగా
క్రమశిక్షణ సాధనంగా
సహనం శక్తిగా
విజయ తీర గమ్యంకి చేరాలి
అత్యున్నత శిఖరాలు అధిరోహించాలి.
దేశ ప్రతిష్టను ఎలుగెత్తి చాటాలి.
ప్రపంచ చరిత్రలో చిరస్థానం పొందాలి.

# ఓ యవ్వనమా !

జి.హెచ్. మల్లేశ్వరరావు, ఎ.యం.యల్. 43

చిగురించే ఓ మా యవ్వనమా,
స్మరించేము నిను మేము ప్రతిక్షణం.
నీ యందలి ఉత్సాహం,
మా వయస్సుకు ప్రోత్సాహం.

నవ జీవితానికి ఆరంభము నీవు,
జీవన మలుపుల తొలిమెట్టువు నీవు.
నిను దాటివెళ్ళిన ప్రతి తలంపు,
మా అందరికి జీవపు మేలుకొలుపు.

గంతులేయించి మురిపించేవు,
గారడి చేసి మై మరపించేవు.
తుదకు నిను వీడ భారమనిపించెను.
తప్పని చెప్పినా !! చేసిన అల్లరులగుపించేను.



ఎందుకీ కొద్దిపాటి బాధలన్నీ,
యవ్వనమా, చేయకు మమ్మల్ని ప్రేక్షకుల్ని
అనుభవించనీ యవ్వనపు తేనెరుచుల్ని
అలరించనీ మా తోటి వారి ఆశాకాంక్షలన్నీ.

అందుకే !
యవ్వన పువ్వుల్లా పరిమళిద్దాం,
నవయువ సమాజానికి మేలు చేద్దాం
భూమాత పేరునే నిలబెడదాం,
తోటమాలి (భగవంతుని) మెడలో
పూలమాలలవుదాం.

# ప్రేమ జీవి

తుమ్మల వరదీష్, యన్.ఇ.టి. 13, బి.ఎ. రెండవ సం॥



ఎప్పుడు జరిగిందో తెలీదు ఈ సంఘటన
నా మనసును చేశాను ఆమె అందానికి పరం
ఎన్నాళ్ళు గడిచినా రాలేదు ఆమె నుంచి వరం
మనసును కోల్పోయిన నా శరీరానికి వచ్చింది జ్వరం
దానిని తగ్గించేందుకు పట్టింది ఒక వారం
ఇంతలో రానే వచ్చింది పరీక్షల సమరం

ప్రేమ నామం జపిస్తున్న నాకు చేదు
అనుభవం పరీక్ష
పెద్ద వాళ్ళకు ఈ విషయం తెలిసి
తొక్కమన్నారు రిక్షా
నా ప్రేమను గెలిపించడంలో
మన్మధుడే రక్ష
విధి వక్రించిందేమో కాలం నాకు వేసింది
ఓ పెద్ద శిక్ష
మాటి మాటికి ఉద్యోగులను మార్చే ప్రభుత్వానికి
నేనంటే ఎందుకో అంతకక్ష
వాళ్ళ నాన్న ట్రాన్స్‌ఫర్‌తో ఎత్తడానికి కూడ
పనికిరాను భిక్ష

# నేనిక బడికి రాను టీచర్

సందీప్ ఉయ్యూరు, ఎ.బి.జడ్.20, బి.యస్.సి

స్కూలుకి యూనిఫాం వేసుకురాలేదని
బ్యాడ్జి మరచి వచ్చానని
బెల్టు పెట్టకోవడం రాదని
సాక్స్ మాసిపోయాయని
బుక్స్ అట్టలు చిరిగిపోయాయని
ఒక్కోరోజు - ఒక్కో కారణం
వీళ్ళు నన్ను శిక్షించడానికి
పొద్దున్నే లేవడం
అరగంటలో అన్నీ కానిచ్చి
పుస్తకాల బస్తా భుజానికెత్తుకొని
ఇంటి ముందు హారన్ కొట్టే
స్కూలు రిక్షాలో కుదేసుకొని
A ఫర్ ఆపిల్ అనీ
A టు Z చదివేసి....
వన్ టూ త్రీ లన్నీ...... అప్పచెప్పేసి
ఎల్కేజీలోనే ర్యాంకుల పోటీలో
పరుగులు పెట్టే నా మూడేళ్ళ ప్రాయం
ఇంకా 18 ఏళ్ళ వరకూ మానని గాయం



# అభినందన మందార మాల - 2005

బి. వెంకటరెడ్డి, డి.పి.: 13

హాయ్ ఫ్రెండ్స్

నూనత సంవత్సరం రానే వచ్చినది. కమ్మని కలలకు నూతన సంవత్సరం ఆహ్వానం కావాలని కోరుకుంటూ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు. న్యూ ఇయర్ విషెస్‌ను రకరకాల గ్రీటింగ్స్‌తోనే కాకుండా వివిధ భాషలలో తెలుపవచ్చు. మనకు తెలిసిన కొన్ని భాషలు చూద్దామా... మరి.

A ఫ్ఘనీ : సాలే నవో ముబారక్ !
A రబిక్ : అంతుమ్ సాలిమోన్ !
Aa ఫ్రికాన్స్ : గెలుక్కిగెనువె జార్ !
Be ంగాలీ : శువో నబో బర్షో !
C ంధీ : నయోసాల్ ముబారక్ హోజే !
Chai నీస్ : చుషెన్ తాన్ !
E ంగ్లిష్ : హ్యాపీ న్యూ ఇయర్ !
Fre ంచ్ : బాన్ ఆనీ !
Gree క్ : కెనౌరియోస్ క్రొనోస్ !
Hi ంది : నయా సాల్ కీ ముబారక్ !
He బ్రూ : లెషానా తోవా !
Ja ర్మన్ : ప్రోసితో న్యూ జహర్ !
Ka న్నడ : హోసా వర్షాదా శుభాశయ గళు !

Po ర్చుగీస్ : ఫెలిజ్ ఆనో నోవో !
Pa ంజాబీ : నవేసాల్ దే ముబారక్ !
Ra ష్యన్ : నోవియ్ గోడోయ్ !
Spa నిష్ : ఫెలిజ్ ఆనో న్యూవో !
Su డానీస్ : వర్సాఎన్ గాల్ !
Te లుగు : నూతన సంవత్సర శుభాకాంక్షలు !

Ta మిళం : ఇనియె పుత్తాండు !
Ta ర్కిష్ : యితినిజ్ కుత్ లూ ఓల్సన్ !

హ్యాపీ న్యూ ఇయర్ !
As another wonderful year dawns

☞ ఎదుటివాని తప్పు చెప్పేటప్పుడు మన తప్పు లేకుండా చూడాలి.
☞ ప్రతి ఓటమి ఒక గెలుపుకు నాంది (బలం)

# సుఖదాయకం

సాగర్, యన్.యం.యల్. 44

ఆటవిడుపుగా సాగే ఆదివారం
సరదగా సాగే సోమవారం
కాలేజీకి మంగళం పాడే మంగళవారం
బోర్ కలిగించే బుధవారం
గురక పెట్టే గురువారం
సూపర్ డ్రస్సింగ్‌తో శుక్రవారం

సగం హాలిడే శనివారం
ఇదే కదా ప్రతీ వారం వాతావరణం
మార్చాలి యీ పయనం
మార్చనిచో జీవితం అగును అంధకారం
మార్చినచో జీవితం అగును సుఖదాయకం

# స్వప్నమా

ఎ. జె. కిరణ్ రెడ్డి

నా ముందర ఉన్నది ఓ సౌందర్యవనిత
వెంటనే వ్రాయాలనిపించింది ఓ చిన్ని కవిత
దాన్ని చూచినది మొదలు నాలో గిలిగింత
నాలో ఎగిసిపడ్డాయి ఆశాకెరటాలు కొండంత !

ఆమే నిండిపోయిందిగా గుండెంత
చిలిపిగా నవ్విందిగా రవ్వంత
గోముగా చూసింది గోరంత
తోడు ఉంటాలే ఆమెకు జీవితమంత !

రేగింది నాలో ప్రేమ ఆపలేనంత
వురికింది ఆనంద కెరటం దాచలేనంత
మ్రోగింది సంతోష వీణ నాలోనంత
పారింది కోరిక జలం ఆగలేనంత !

కళ్ళు తెరచి చూచాను లోకమంత
నా ముందర ఉన్నది శూన్యం అంతా
వెతికాను వెతికాను ఆ సుందర కాంతను
అప్పుడు తెలిసిందిలే స్వప్నమని ఇదంత





# రుణం తీరుస్తాం

పి. శ్రీనివాసరావు, ఎ.పి. 18



మాలో మంచిని పెంపొందించారు
మాలో చెడును అంతరింప జేసారు
మా సుఖ సంతోషాలు మీవని భావించారు
మా క్షేమమే మీరెప్పుడూ తలచారు
మా మంచి కొరకు మీ ఆత్మ విశ్వాసం సైతం తాకట్టు పెట్టారు
మా గెలుపు కోసం మీ ఆనంద ఆర్భాటాలు నిత్యం వదలిపెట్టారు
మా కంటి చెమ్మ భూమిని తాకకుండగ
మీ శరీరమును కొవ్వొత్తిగా కరిగించారు
మీ రక్తపు బొట్టులను చెమటగ నేలను చేర్చారు
మా కొరకు భరింపలేని భారం భరించారు.
మా అనుకున్న ప్రతిదీ మీదనుకొని మా కందించారు
ఇటువంటి మిమ్ము మాకిచ్చి ఆ దైవం మాపైన తన
వాత్సల్యాన్ని చాటుకున్నాడు
మీరు ఆ దైవం మాయందు మీకిచ్చిన బాధ్యతను సక్రమంగా పూరించారు.
కాని మేము మీకు ఏమిచ్చి రుణము తీర్చుకొనగలమూ?
అందుకే !

మీ ఆశల జెండా ఎగరేస్తాం
మీరు కోరిన పథమున పయనిస్తాం
ఈ విధముగ మీ రుణము తీరుస్తాం.

# గురువుకు వందనం

వెంకటేష్, ఆర్.యం.నై. 9



ఓ..... విద్యార్థి లోకమా !!
విజయ దీపికలుగా విద్యార్థులను మార్చి
విద్యార్థి సేవకు అంకితమై
మీ విజయాల బాట వెనుక ఉన్న గురువుకు
వందనం...! అభివందనం.... !!

విద్యార్థి విజయాలను కాంక్షించి
నూతన విజయాలకు బాటలు వేసి
విద్యా విజయ కాంతులతో విలసిల్లే
విద్యాలయపు విజయ చిహ్నం గురువు
అటువంటి గురువుకు వందనం... ! అభివందనం... !

# RTC ట్రావెలింగ్

జి. ఆల్బర్ట్, టి.ఎ. 19



గంటల తరబడి స్టాండింగ్
బస్సుల కోసం వెయిటింగ్
షెల్టర్ లేక ట్రబులింగ్
ఎక్కే వరకు ర్యాగింగ్
లోపలంతా పుష్షింగ్
సీట్లకోసం ఫైటింగ్
జేబులో పర్సులు మిస్సింగ్
ప్రయాణం అంతా చెకింగ్
దిగేటప్పుడు త్రోయింగ్
ఇదే ఆర్టిసి ట్రావెలింగ్

# స్వాతంత్ర్యమా....??

బి. రామారావు, యన్.ఇ.టి. 7

ఏనాటి కొరడా దెబ్బలు తిన్న జనవాసం
ఆనాటనే తెల్లదొరలను పొమ్మన్న పౌరుషం ?
ఏ గడియనో కలలుగన్న భారతాత్మల వికాసం
మారు దేశమై గళమెత్తిన సాహసం !

స్వదేశీ జల్లులు కురిసింది
హిందూ ముస్లిం కలిపింది
కుంగిన పుణ్యభూమి లేచి[illegible]

ఎందరో మహాత్ముల రక్తాలు యేరులైతే
మరెందరో వీరుల గుండెల్లో తూటాలైతే
కవీంద్రుల కరములు ఖడ్గాలైతే
పరాయి పెత్తనం పరారైన వేళ

మంచురాల్చింది వెన్నెల కురిసింది
సమతను పెంచింది
స్వాతంత్ర్యాన్ని తెచ్చి పెట్టింది.

లెల్లవారున తెల్లవారస్తమించిన వేళ
తేజరిల్లిన భారతీయుల సందడి వేళ
ఇంటింటా గోల, ఈలలైన వేళ
లంచగొండిని మనసులో నాటిన వేళ

మాతృ ప్రేమ కాలరాసింది
చేదు మొగ్గ తొడిగింది
భరతావని కన్నీరు కార్చింది.

స్వాతంత్ర్యమా... ?? ఇది
స్వార్థమయమా...??

## ఎందుకీ శాపం?

బి. చైతన్య, ఆర్.యం.వై. 42



కడలి తల్లి కొడుకా
దారి తప్పెనా నీ నడక?
కూడు పెట్టు నీ తల్లి కోపగించుకుంది ఏల?
కఠోరంగా విరుచుకు పడెనేల?

పొట్టచేత పట్టుకుని వచ్చావు ఈ తల్లిని నమ్మి
కానీ నీ ఇంటోళ్ళకు మిగలలేదు నీతో సహా ఏమీ
తెలవారకముందే వెళ్ళావు చేపల వేటకని
అప్పుడు తెలీదు ఎవరికీ నువ్వు తూర్పు సంధ్యను
ఇక చూడలేవని

నీ తల్లి కోపం దాల్చింది భయంకర రూపం
ఉప్పెనై నీ ప్రాణాలు మింగే అయ్యో పాపం
ఏం చేశావనో నీకు ఈ శాపం

## ఆ కలలో......

వి. దేవసహాయం, ఆర్.యం.వై. 73

కల వచ్చింది
కమ్మని కల వచ్చింది
అర్ధరాత్రి వేళలో
నిదురపోవు వేళలో
ఆ కలలో
ఓ కమ్మని కథ గుర్తొచ్చింది
కలము ప్రక్కనున్న
కాగితం ఉన్న
వ్రాయలేక నేను రాయిలాగ ఉన్న
మరతునన్న మరపురాని కల
నా మధురమైన కల
నా కల నిజమయ్యే దెప్పుడో !
నా కలతలు తీరేదెప్పుడో !
నే కలం పట్టేదెప్పుడో !
నే కథలు వ్రాసేదెప్పుడో !

## తెలుగు తల్లి పరిస్థితి

సి.హెచ్.వి.యస్. ఫణీంద్రనాథ్, డి.ఇ.టి. 3



వందనమమ్మా! తెలుగు తల్లి,
ఆది కవి కలం ద్వారా వెలిశావు,
శ్రీనాథ, పోతనల కవిత్వాల ద్వారా వెలుగు చూశావు,
ప్రజల మాటల ద్వారా అభివృద్ధి చెందావు

ఆంధ్ర దేశమున నిలిచావు;
ప్రపంచ ఖ్యాతిని పొందావు.

నాడు నీవే సర్వం అన్నారు,
ఎందరో కవులు వెలిశారు,
ఎన్నో కవిత్వాలు రచించారు,
నిన్ను అందలం ఎక్కించారు;

నేడు నిన్నే విస్మరించారు,
నీ తలంపే అవమానం అంటున్నారు,
పరభాషకు దాసోహం అంటున్నారు
పరదాలోన నిన్ను పడవేస్తున్నారు;

ఎందరు నిన్ను కాపాడాలని ప్రయత్నిస్తున్నా,
ఎందరు నీ కోసం త్యాగాలు చేస్తున్నా,
నిన్ను రక్షించలేక పోతున్నారు తల్లీ !

ఎన్నాళ్ళమ్మా నీకీ కష్టం,
ఎందుకమ్మానీకీ దుస్థితి?

మధ్యగతమస్తు | | పౌనఃపున్యమస్తు

కోరిలేషన్స్ వారి **పెళ్లిసందడి**

# సాంఖ్యక వివాహమహోత్సవ ఆహ్వాన శుభ ప్రతిక

**నా సహోదరుడు (కీ. శే. మల్లిపుల్ కో రిలేషన్ గారి ద్వితీయ పుత్రుడు)**

**వరుడు : చి॥ ఫార్షియల్ కొరిలేషన్ కు**

**(లయోలా కాలేజి సాంఖ్యక శాస్త్ర లాబ్ కాపురస్తులు మహ రాజశ్రీ మల్టిపుల్ రీగ్రషన్ బావగారి ప్రథమ పుత్రిక)**

**వధువు : చి॥ ల॥ సౌ॥ పార్షియల్ రీగ్రషన్ ను**

**సుముహూర్తం** : స్వస్తి శ్రీ సగటు నామ సంవత్సర అంకగణితపు సగటు తిథి అంకమధ్యమ సగటు నక్షత్రయుక్త శుభ ఘడియ ఆదివారం ది.**13-02-2005** రాత్రి డిగ్రి వద్ద వివాహము జరుపుటకు పెద్దలు నిర్ణయించినారు.

**వివాహ వేదిక** : ఆంధ్రా లయోలా కళాశాల గ్రౌండ్స్ నందు జరుగును.

**విన్నపము** : తామెల్లరూ తప్పక విచ్చేసి కాలిక్యులేషన్స్ చేసి మమ్మానందింపచేయ ప్రార్థన.

**విందు** : మ॥ 12 గం॥లకు కాలేజి గ్రౌండ్స్ నందు జరుగును.

గమనిక : కాలిక్యులేటర్స్ స్వీకరింపబడవు.

ఇట్లు

మీ ఆగమనాభిలాషులు

**శ్రీమతి & శ్రీ కోరిలేషన్**

**సాంపిల్ ప్రింటర్స్, బీసెంట్ రోడ్, విజయవాడ**

బస్సురూట్లు : మార్కెట్ నుండి 11 యం, 27, 28, 29, 54

- డి. పవన్ కుమార్, యన్.ఇ.యం. 9

## వి-చిత్ర శుభలేఖ

సాలిడస్తు | లిక్విడస్తు | గ్యాసస్తు

# రసాయన వివాహ మహోత్సవ పత్రిక

శ్రీశ్రీశ్రీ పాదరస నామ సంవత్సరమున శుద్ధ యురేనియం తిథి శుభ ఘడియన

మా ప్రథమ మూలకము

చి॥ హైడ్రోజన్

లయోలా కాలేజి కెమిస్ట్రీ లాబ్ కాపురస్తులు

శ్రీ ఓజోన్ గారి ద్వితీయ మూలిక

**చి॥ ల॥ సౌ॥ ఆక్సిజన్‌కు**

శ్రీ ఓజోన్ గారి స్వగృహము నందు

ఇచ్చి **09-02-2020**న రాత్రి **12** గం॥లకు లయోలా లాబ్‌లో వివాహము జరుపుటకు పెద్దలైన ఉత్ప్రేరకాలు నిర్ణయించారు. తామంతా విచ్చేసి లాఫింగ్ గ్యాస్‌ను పీల్చి టెస్ట్ ట్యూబ్‌లను పగుల గొట్టి ఉభయులను మట్టిపాలు చేయ ప్రార్థన.

విందు : మధ్యాహ్నం 24 గం॥ లకు బయాలజీ లాబ్‌లో జరుగును

గమనిక : పాదరసపాలు స్వీకరించబడును

కార్యనిర్వాహకులు : ఆమ్లాలు, క్షారాలు, లవణాలు

ఇట్లు

**శ్రీమతి & శ్రీ జింక్ ఆక్సైడ్**

బి. కీర్తి క్రిష్ణ, బి.యస్.సి. మొదటి సం॥ ఎ.సి. 40

# మదర్ థెరిసా

కె. సాయి కుమార్, డి.ఇ.టి. 13



అవమానాలే ఎదురైనా,
ఆటంకాలే అడ్డైనా,
ఆదరణ లేక పోయినా
అవకాశాలే కరువైనా,
గిట్టని వాళ్ళు గీపెట్టినా,
రాళ్ళనే రువ్వినా,
ఆమె లక్ష్య పెట్టదు ఏది ఏమైన.
ఎందుకంటే?........

అంకిత జీవితం ఆమె లక్ష్యం
ఆదరణ భావం ఆమె చట్టం
బీదా బిక్కి ఆమె చుట్టం
ఆకలి దప్పులకు ఆమె సర్వం
అనాధలంతా ఆమె భాగ్యం
మాతృమూర్తికి శరణం శరణం

పసి పాపలకు ఆమె ఒడి ఊయల
వృద్ధులకు ఆమె మాటే ఓదార్పు
రోగులకు ఆమె ఆరోగ్యమూర్తి
దీనులకు ఆమె దయామూర్తి
అజ్ఞానులకు ఆమె జ్ఞానమూర్తి
మనకు ఆమె ఆదర్శమూర్తి
మానవ మనుగడకు ఆమె దివ్య జ్యోతి
మాతృమూర్తికి వందనం వందనం

చెరగని నవ్వు ఆమె సొంతం
కళ్ళలోని కరుణ ఆమె బంధం
ప్రేమకు ప్రతిరూపం ఆమె
"శాంతికి చిహ్నం" ఆమె

పేదవారికి "పద్మశ్రీ" ఆమె
భారతావనికి "భారత రత్నం"
ఆ మాతృమూర్తికి మంగళం మంగళం

భీతిల్లే వారికి ఆమె అభయం
ఆశా జ్యోతికి ఆమె మార్గం
అంగీకార తత్వం ఆమె గుణం
కూటికి లేనివారే ఆమె కులం
మానవత్వం ఆమె మతం
అమరత్వం ఆమె జీవం
మాతృ మూర్తికి ఘనము ఘనము

వీధి బాలలే ఆమె ఆటగాళ్ళు
నేరస్తులే ఆమె మిత్రులు
బడుగు వర్గాలే ఆమె బంధువులు
ఆపదలో ఆమె "శ్రీ హరి"
కృప చూపడంలో ఆమె "క్రీస్తు"
ఆదుకోవడంలో ఆమె "అల్లా"
మత భేదం లేదు మదర్‌కు

నిరాశ్రయులకు ఆమె "ప్రేమ నివాస్"
నిర్భాగ్యులకు ఆమె "నిర్మల్ హృదయ్"
శిశు సంరక్షణకు ఆమె "శిశు సదన్"
అశాంతులకు ఆమె "శాంతి నికేతన్"
మాతృమూర్తికి "బీటిఫికేషన్"

మానవసేవే ఆమె దైవం
ఆదర్శప్రాయం ఆమె జీవితం
దేవునికి ఆమె దేవదూత
మహిమ ప్రదాత ఆమె "మదర్ థెరిసా"

# "మాతృ లేఖ"

కుమార్, యన్.సి.పి. 59



ప్రియమైన అమ్మకు,

అమ్మ ! నా జీవితంలో
ఊహలకు అందని రూపంలా మిగిల్చావు
ఎడారిలో ఒంటెలా ఒంటరి పయనం
ఒంటరి జీవితం నుంచి - తల్లి ప్రేమను విడదీసావు
అమ్మా అనేపదం నా నోట
ఒక్క క్షణమయిన........

నా కాళ్ళకు దెబ్బ తగిలిన
ఓర్చుకోలేని మనసు నీది
నీ గుండెలో బాధ నాకు తెలుసునా?

కానీ ! పసికందులోనే తల్లి ప్రేమను కోల్పోయిన వాణ్ణి
అమ్మ అనే మాట నా నోట మాయం
తల్లి ప్రేమ ఎంతో తియ్యనైనది
గోరు ముద్దలు నీ చేతితో తినాలని ఎంత ఆశా !

కానీ ! అదృష్టం నాకు లేకపోయింది
మనసులో మాట బయటకు రాక
లోలోన తల్లిపాలు బదులుగా
గంజినే అమృతంగా భావించా
లోకమంతా అనాధ అని చిన్న చూపు
బదులు చెప్పని నా మనసు ఏమి కాను

అమ్మంటే ఆరోప్రాణం అని ఊహించుకున్న
కానీ ! ఊహా జీవితం దారంలేని గాలి పటం లాంటిది.
అందుకే అమ్మలేని లోటును
ఒక అంగవైకల్యం రూపంలో
అమ్మ ప్రేమను పొందాను

అందుకే ఈ ఉత్తరం
నీ ఆత్మశాంతి కొరకై వ్రాస్తున్న

ఇట్లు
నీ ప్రియ పుత్రుడు
ఎ. క్రిష్ణారావు, యన్.ఇ.సి. 28 మరియు జి. రవి

# "కవితలో ఏముంది"

ఎ. క్రిష్ణారావు, యస్.ఇ.సి. 28

కలము పట్టి వ్రాయాలని ఉంది కవిత్వం
కాని మనసులో తెలియని సిరత్వం
ఇక దేనిపైన వ్రాయను !
అందమైన వనిత కోసమా
పసందైన విందు కోసమా?

కాని నా మనసులో వనితా
ఆ వనితలో ఏముంది కవితార్థం !

నింగిలో హాయిగా విహరించే హంసలా
నా మనసును గాలించుట లేదే !
మదిలో ఏదో తెలియని దాహం

కలము పడితే నా కరములు
కలియు బడతానంటాయి !

హృదయం పదిలమైతే గాని కావ్యం రాదు
అటు మనసేమో చెప్పిన మాట వినదు
ఇటు కలం పట్టి వ్రాయడానికి వీలుకాదు

అందమయిన ఆ కళ్ళల్లో ఆలోచనలు ఎన్నెన్నో
కాని అతివల అందాల పరువాలు చూడలేదే !
వనితా వర్ణించడానికి ఏముంది కవితా
కాని నాలో లేదే మధుర అక్షర రమ్యతా !

వనిత చూసి నవ్విన !
యువత చూసి యేడ్చినా !
బాధ పడేది మనస్సు ఒక్కటే సుమా !
అందుకే ఏమని వ్రాయను !!

# అమ్మ

వెంకట సురేష్ వర్రా, యస్.పి. 24



అనురాగము ఆప్యాయత కలబోతే అమ్మ.
మమతాను బంధాల మరో రూపమే అమ్మ.
ఇలలోన కొలువైన ఆ దైవమే అమ్మ.
భువిలోన వెలసిన కల్పతరువు అమ్మ.
ఉగ్గుపాలతో నన్ను లాలించినది అమ్మ.
కలనైనా నను వీడక కాపాడును అమ్మ.
మనిషిగా నను మలచిన మార్గదర్శి అమ్మ.
మమతనే రుచి చూపిన మాతృమూర్తి అమ్మ.
తన ఒడినే నా బడిగా మార్చినది అమ్మ.
బ్రతుకు బడిలోన తొలి గురువు తానైనది అమ్మ.
తప్పటడుగులు వేసే వేళన నా తప్పులను సరిదిద్దిన
సహనశీలి అమ్మ.
నాలోని భయాలను చిరునవ్వుతో తుడిచేసిన
స్నేహశీలి అమ్మ.
ఈ జన్మలోన ఏర్పడిన తొలిబంధం అమ్మ.
కడదాకా నిలిచిపోవు అనుబంధం అమ్మ.

# ప్రేమమూర్తులు

- ఎ. దీప్తి, ఎ.బి.యం. - 19



- ఎవరిని మరచిపోయినా మాతాపితలను మరువకు
  పరమ హితైషులు వారే నీకని మరువకు
- నిన్ను కనాలని చేసారెన్నో పూజలు రాళ్ళకు
  నీవే రాయై వారి గుండెలు ముక్కలు చేయకు
- గోరు ముద్దలు కొసరి కొసరి పెట్టి పెంచారు నిన్ను
  అమృతం నీ కందించిన వారిపై విషం కక్కకు
- ముద్దు మురిపెం చేసారు, నీకు తీర్చారెన్నో కోరికలు
  ఆ ప్రేమ మూర్తుల ఆశలు కూడా తీర్చాలని మరువకు
- లక్షలు కోట్లు గడించినా ధీటేనా అవి తల్లిదండ్రులకు
  చేసుకున్న వారికి చేసుకున్నంత అన్న సత్యం మరువకు
- ధనం లేకపోతే పొందవచ్చు కానీ దొరకరు తల్లిదండ్రులు
  ఆ చరణ కమలాల పవిత్రతను జీవితాంతం మరువకు
- కోపాన్ని దరిచేర్చకు, ఆవేశంతో ఆలోచించకు
  ఉపకారం చేయకపోయినా అపకారం తలపెట్టకు
  ఫలితం ఏదైనా దైవ ప్రసాదంగా స్వీకరించు !

# సునామి - ఓ ప్రళయం

నాగోతు శౌరి కిషోర్ కుమార్, యన్.యం.యల్. 55



సునామి మాపై జాలి కలుగదేమి
మాపై కోపానికి కారణం ఏమి
హటాత్తుగా వచ్చావు
ప్రాణాలు తీసావు
ఆస్తులు తుడిచేసావు
మమ్ము బాధలో ముంచావు
ఇక చాలు నీ ప్రతాపం
చూపు మాపై కనికరం
చూసాక ఈ నష్టం
కలిగిందా నీకు ఆనందం
కలిగితే నీకు కనువిప్పు
మరల చేయకు ఆ తప్పు

# అమ్మా

పి. రవి, డి.జి.హెచ్. 20

నీ త్యాగం 9 + 3 = 12 : 5 = 5
గర్భంలో 9 నెలలు మోసింది
పురిటినొప్పులు భరియించింది
ప్రసవ వేదనను అనుభవించింది
గర్భలోకం నుండి భూగర్భలోకానికి తీసుకు వచ్చింది
మొదటి 3 నెలలు ముత్యంలా చూసుకుంది
తన కళ్ళతో ఈ లోకాన్ని చూపించింది
తన శ్వాసతో ఈ ప్రాణికి ఊపిరి పోసింది
కురూపిని అయినా విసిగించుకోలేదు
అందవికారున్ని అయినా వదిలివేయలేదు
తన రక్తాన్ని పాల రూపంలో పంచింది
ప్రతి అవయవానికి జీవం పోసింది
ప్రతి అంగానికి ప్రాముఖ్యతనిచ్చింది
తన సంవత్సరపు, 12 నెలల జీవితం సంపూర్తిగా
నాకు జీవాన్ని ఇవ్వటం కోసం త్యాగం చేసింది.
మరో 4 సంవత్సరాలు నా నలుగురు తోబుట్టువులకు ధారపోసింది.
ఈ తన 5 సంవత్సరముల త్యాగ జీవిత ఫలమే
ఈ 5 జీవాల ప్రతిరూపం.
కావున అమ్మా నీ జీవితం 9 + 3 = 12 : 5 = 5
అభిరుచులను చంపుకుంది
ఆవేదనను భరియించింది.
మాటలు నేర్పింది - మంచిని నేర్పింది
నడకను నేర్పింది - నడవడిని నేర్పింది
ఓనమాలు నేర్పింది - ఓర్పును నేర్పింది
ప్రేమను నేర్పింది - స్నేహాన్ని నేర్పింది
అనురాగాన్ని నేర్పింది - ఆప్యాయతను నేర్పింది
మమతను నేర్పింది - మానవత్వాన్ని నేర్పింది
తత్వాన్ని నేర్పింది - త్యాగాన్ని నేర్పింది.
కావున అమ్మా ! అవధులు లేనిది నీ ప్రేమ
అంతం లేనిది నీ ప్రేమ .........



# రాలిపోతున్న రైతన్న

ఎ. సునీల్ కుమార్, మూడవ సం॥ బి.జెడ్.సి (బి.యస్.సి) డి.బి. 3

నిరాశతో నిండిన ఆ అస్థిపంజరపు
గూళ్ళలో దారిద్ర్యపు వికటాట్టహాసం
ఎందుకు ఎందుకీ అపశృతి
కలితీ విత్తనాలు ఇచ్చినందుకు
నకిలీ ఎరువులు పంపినందుకు
వడ్డీదారుల దౌర్జన్యం మితిమీరినందుకు
అధికారుల కుంభకోణాలు పెరిగినందుకు
వన భూములను స్మశాన భూములుగా మార్చినందుకు
జలధారలను ఆవిరి చేసినందుకు
కాలుష్య దైత్యుడ్ని పెంచి పోషించినందుకు
లంచం కోరల విషం విరచిమ్మినందుకు
అందుకే అందుకే మన రైతన్న రాలిపోతున్నాడు
దేశం వెన్నెముక కూలిపోతున్నాడు
మేలుకోకుంటే మన వినాశనం తప్పదు
రైతన్న కన్నీరు తుడవకుంటే
అన్నం పెట్టే చేతిని విరిచేస్తే
చివరకు మన కన్నీరు తుడిచేవారుండరు సుమా !

# కన్నవారి ప్రేమ

జి. సందీప్, ఎ.జి.హెచ్. 14

నయనాల్లో మెరుపులు మెరిపిస్తూ
హృదయంలో అనురాగం కురిపిస్తూ

తమ కంఠంలో గరళాన్ని మింగుతూ
అందరికీ అమృతాన్ని పంచుతూ



ఎన్ని కష్టాలొచ్చినా, ఎన్ని నష్టాలొచ్చినా అవన్నీ తమవే అంటూ
ఆనందాలు, ఆర్భాటాలు మాత్రం తమవారి కంటూ
తమ ప్రాణాలు సైతం లెక్కచేయక
తమవారు అధిరోహించబోయే ఉన్నత శిఖరాలే దృష్టిలో ఉంచుకొనగ

మన కొరకు దివి నుండి దిగి వచ్చిన దేవతా మూర్తుల్లా అనిపిస్తూ
కన్నుల ఎదుట కళ్యాణ వైకుంఠంలో భవానీ శంకరులులా కనిపిస్తూ

ఉన్నవారే, వారే, మన అమ్మ నాన్నలు
నిత్యం మనపైనే వారి ఆశలు

గంగలో మునిగితే పోవునేమో గాని మన పాపాలూ?
కాని, మన అమ్మనాన్నలను పూజిస్తే నిత్యమూ తొలిగేనూ మన పూర్వ జన్మ శాపాలు.

# అల

పి.వి. సుబ్బారావు, నెం. 53

ఒకనాడు
సముద్రపు అల
అవిశ్రాంతపు మనసులను సేదతీర్చు అలై
విహార యాత్రికుల మనసులను దోచె అలై
రకరకాల గవ్వలిచ్చి పిల్లల్నాడించె అలై
వేసవిలో చల్లని గాలినిచ్చె చల్లని అలై
మత్స్య కారులకు వరమై నిలిచిన అలై
విశ్రాంతి ఎరుగని ఆ అవిశ్రాంతపు అల

ఈనాడు
ఉషోదయ వేళ
సూర్యుని కిరణాలతో  పోటీపడి
పక్షుల వెనకాల వెంట పడి
నింగినంటి
అదుపు తప్పి
ధాత్రిని కప్పి
కన్నెర్ర చేసిన ధరణి సాక్షిలా
జనంపై వలై లేచిన అలలా
కన్నీళ్ళు మాత్రం మిగిల్చిన అల
నిమిషాల్లో శవాలను చేసి
గంటల్లో ఆ శవాలను చూపి
రోజుల్లో చరిత్రపుటల్లో కెక్కి
కూడు నీడా లేని వాళ్ళను చూసి
దోచిన దానిని తిరిగివ్వని ఓ అలా !

మరల తిరిగి రావద్దని 2005

# రారా నాసామి రంగ మామా నువు రారా

డి. వరలక్ష్మి, డి.నెం. 03144



రారా నాసామి రంగ మామా నువు రారా
సదువు కుందాము బడికి పోదాము రారా

పట్నమెల్లి పైసలు తెస్తానని
నువు నన్ను యిడిసి ఆర్నెల్లు ఎల్లినప్పుడు
ఉత్తరం ముక్కనాకు వస్తుందని
కళ్ళు కాయలు కాసేదాక సూసినప్పుడు
జాబులిచ్చేవోన్ని ఎన్నిసార్లు అడిగాను
రాతసేత కాక నిన్ను ఎన్ని తిట్లు తిట్టాను.

అక్క బిడ్డ పెళ్ళికి ఎళ్ళాలని మనం
ఉషారుగ బస్టాండు కెళ్ళినప్పుడు
రామారం బస్సనుకుని ఎక్కినప్పుడు
అది సోమారం సెరవుకాడు దించినప్పుడు
బిక్కమొకాలేసుకొని దిక్కులొంక సూసినాము
పిల్ల జల్లాల తోడి నడవలేక సచ్చాము.

రారా నాసామి రంగ మామా నువు రారా
సదువు కుందాము బడికి పోదాము రారా

పిల్లోడికి సబ్బు సేసి నోసినప్పుడు
నువ్వు రాయుడింటి కెళ్ళి అప్పు అడిగినప్పుడు
వంద యిచ్చి ఎయ్యి లెక్క రాసినప్పుడు
నీకు తెలియకుండ ఏలిముద్ర లేసినప్పుడు
పంచాయితీ పెద్దోళ్ళకు ఏమి సెప్పుకున్నాము
అప్పు తీర్చమంటే మనం తిప్పలెన్ని పడ్డాము.

వంగ తోటపైన సీడ బడితె నువ్వు
పురుగు మందు కొట్టుకు పరుగులిడితె
ఎర్రిబాగులోడి కింద లెక్కగట్టి
నీకు డొక్కు మందులన్ని అంటగట్టి
సొమ్ము సేసుకున్నది మరిసిపోతున్నావు
దిమ్మ దిరిగి రాగానె బుద్ధి తెలియకున్నది.

రారా నా సామి రంగ మామా నువు రారా
సదువు కుందాము బడికి పోదాము రారా

సదువు కుంటె తెలుత్తాది లోకం పోకడ
అచ్చరాలతో తెలివి తేటల రాకడ
సదువంటె మనిసికి నిసరాత్రి ఎలుగురా
సదువంటె ఎప్పుడు ఎంటుండె కలిమిరా
వయసు నీకు ఎప్పుడు సదువుకడ్డు రాదురా
మనసు పెట్టి కూకుంటె సదువు సిటికెనేలురా

పూత రేకులాంటి దానా నీమాటె వింటానె
నస పెట్టకుండ నేను రాత్రి బడికి వస్తానె.

# మృత్యుఘోష

డి.వి.కె. యశ శ్రీ పెరుమాళ్ళు, యస్.పి. 45

సకల జనజీవనానికి మూలాధారం జలం
జీవనాధారం కోసం సముద్రునితో వీడలేని బంధం
ఇలాతలం మీద ప్రశాంత ప్రదేశం అంబుధి తీరం
పాపపుణ్యాలను దాచుకునే పెన్నిధి సాగరం

ఆగ్నేయాసియాలో భూమాత కంపించింది.
నింగి పిలిచినట్లు నీలికెరటం పైకి ఎగిరింది
సాగరజలం గట్లుదాటి ముందుకురికింది
మంచు తెరలు వీడకముందే ముప్పు ముంచుకొచ్చింది
దారిపొడవున అడ్డొచ్చిన ప్రతిదాన్ని ముంచెత్తింది
నిద్రలో సేదతీరుతున్న వారిని శాశ్వతనిద్ర పుచ్చింది.

మృత్యుఘోషలను వినిపిస్తూ ఉరికాయి కడలికెరటాలు
మరు నిమిషంలో ఆ తీరాలు దుఃఖసాగరాలు
శవాలగిద్దంగిని తలపిస్తూ ఎటు చూసిన శవాల గుట్టలు
చెట్టుపుట్టలపై చిక్కుకున్న వాహన, గృహ శకలాలు

తమకు తాళికట్టిన భర్తలను కోల్పోయి కొందరు
జీవిత భాగస్వాములయిన భార్యలను పోగొట్టుకొని కొందరు
ప్రేగుతెంచుకున్న బిడ్డల్ని కోల్పోయి మరికొందరు.

జన్మనిచ్చిన తల్లిదండ్రుల్ని కోల్పోయి ఇంకొందరు
ఆత్మబంధువులతో పాటు జీవనాధారాన్ని కోల్పోయారందరు
ముంచుకొచ్చిన సాగరకెరటాలతో కకావికలయ్యారు.

రెక్కాడితేకాని, డొక్కాడని నిరుపేదలు
మొగ్గగానే వసివాడిన చిన్నారుల
సామూహిక ఖనన సంస్కారాలు
విషాద వదనాలలో అశ్రుపూరిత నయనాలు
ఎటుచూసిన రెక్కలు తెగిన విగతజీవులు
మరుభూమిని తలపిస్తూ మరణ మృదంగ ధ్వనులు

కడలి కడుపు చీలింది జనం ఎదను చీల్చింది
ఉన్న గూడు చెదిరింది, గుండె చెరువైంది
తనను ఆదరించి, అన్నంపెట్టిన ఊరు పొమ్మంది
ధరణిమాత సముద్రుని ప్రకోపానికి గురైంది.

నింగికెగిసిన వారు లక్షాపైభైవేలు
నిరాశ్రయులైన వారు కోకొల్లలు
జలప్రళయంతో ఛిద్రమయ్యాయి జీవితాలు
కన్నీళ్ళే ఈ జల ఉత్పాతపు దుష్టజ్ఞాపకాలు

# సునామీ

కొమ్మనబోయిన వెంకట్రావు, డి.ఇ.టి. 17

ప్రకృతి మాత దుఃఖం
జీవకోటికి ప్రాణ సంకటం
ఉప్పొంగిన సముద్రపు అలలు
చెదిరెను మత్స్యకారుల కలలు
తీరప్రాంతాలకు తీరని లోటు
జీవనాధార వృత్తులపై వేటు
సముద్రుడి ఆగ్రహం
పర్యాటకులకు ప్రాణ సంకటం

అంచనా లేని ఆస్తి నష్టం
తట్టుకోలేని ప్రాణ నష్టం
ఎందరో నిరాశ్రయులు
సునామీ బాధితులు
మనందరి సహకారం
వారికి జీవనాధారం
చేయి చేయి కలుపుదాం
వారికి చేయూతనిద్దాం.



# పాపం

డి. నాగేశ్వరరావు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిందీ.

నిన్నటినించి మనసంతా చికాగ్గా ఉంది. రెండు సంవత్సరాలుగా జరుగుతున్న పరిణామాలకు కొసమెరుపు నిన్నటి మీటింగు. మా డి.ఎం.గారు డిపో స్టాఫుని కూచోబెట్టి మెత్తగా చివాట్లేశాడు. మా పనిలో చరుకు తగ్గిందట. మా 'రీజన్లో' నష్టాలు భరించలేనంతగా ఉన్నాయట. ఇన్నాళ్లు చేసిన డ్రైవరు ఉద్యోగంలో కొత్త బాధలు మొదలై తారస్థాయికి చేరుకున్నాయి. కర్మండి చావుకి కారణాలుగా - ప్రైవేటు జీపులు, ఆటోలు, అధికారుల స్వార్థమూ కనబడుతున్నాయి. మనసులో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.

లక్ష్మి అందించిన క్యారేజీతో ఎనిమిదిన్నరకల్లా రోడ్డుమీదకొచ్చాను. ఇవాళ 'గన్నవరం' బండి సర్వీసు - దారిలో కనబడిన ఆర్టీసీ బస్సు రోడ్డున పోతుంటే కనబడిన చుట్టాన్ని చూసి కాల్లు వాటంతట అవే ఆగినట్టుగా - ఆగింది. డ్రైవరు రాము పరిచయస్తుడే - వెళ్ళి బానెట్ మీద కూచున్నాను. 'ఏం మూర్తీ, ఇయాలేందో దిగులుగా వున్నావే' గేరు మారుస్తూ పలకరించాడు. నవ్వి ఊరుకున్నాను. 'ఎన్ని మేనేజిమెంట్లు మారినా - మన రాతెవుడు మార్చగల్డు? నాయాల్డి - కుక్క బతుకైపోయింది - కనబడ్డ సోటల్లా పాసెంజర్ల కోసం ఎదురు సూపులే !' ఆక్రోశించాడు రాము. వెనకనించి వచ్చిన కండక్టరూ అందుకున్నాడు. "ఈ ఆటోలు నిజంగా కొంపతీస్తున్నాయీ రూట్లో? ఎంతముందెక్కేటోళ్లు - ఇప్పుడంతా ఆటోల కెగబడ్డమేగా - ఈ డెంత ఖాళీగా ఉన్నా కూసోరు - ఆటోల్లో ఒకళ్ళ మీదొకళ్ళు కూసుంటారు - జనానికి బుద్ది లేదు గురూ" జనాల బుద్దిమీద కండక్టరు వ్యాఖ్య ఎలా ఉన్నా గత మూడేళ్లుగా పెరిగిపోయిన ఆటోల సంఖ్య మటుకు నిజం ! ఈ రూట్లో కాలేజి మానేసిన ప్రతి గుంటడూ ఆటో నడిపేవాడే ! పొలాలకెళ్ళే కూలీ వాళ్లు కూడా ఖాళీ టైంలో ఆటో నడుపుతున్నారు.

గత రెండు - మూడేళ్లుగా పేరుకుంటున్న అసహనం, ఆటోలమీద కోపం, మళ్లీ ఉవ్వెత్తున లేచింది. కిటికీ వెనక్కిలాగి సీటుకి జారగిలబడి రోడ్డువంక చూశాను. రెండు ఆటోలు ..... జనాలతో నిండిపోయి ఒకళ్లనొకళ్లు 'ఓవర్‌టేక్' చేస్తూ పోతున్నారు. డ్రైవరుకి నలుగురు అటూ ఇటూ సర్దుకున్నారు. - ఒక మహిళ ఆటో వెనక రాడ్‌మీద కూచుని రోడ్డుమీదే నగం శరీరం వేలాడేసినట్లు కనబడుతోంది. తలతిప్పి బస్సులో సీట్లవంక చూశాను. 'స్త్రీలకి మాత్రమే' అని రాసి ఉన్న సీట్లు ఖాళీగా, ముఖాలు వేలాడేసి కనిపిస్తున్నాయి. కండక్టరూ, పాపం దిగులుగా రోడ్డు వంకకి చూస్తున్నాడు. డి.ఎం.గారు అధికార స్వరంతో మీటింగులో పెట్టిన చీవాట్లు నేపథ్యం సంగీతంలాగా వినబడుతున్నాయి. చెవుల్లో నన్నని హోరులాగా మొదలయింది.

డిపో వచ్చింది. నామ మాత్రంగా ఎక్కిన పదిమందినీ దింపి నేనెక్కిన బస్సు ఉసూరుమంటూ డిపో వెనక్కిపోయింది. నిదానంగా సర్వీసు రిజిస్టర్లో సంతకం బరికి బస్సు ఎక్కి డ్రైవరు సీట్లో కూచున్నాను. కేరేజీ సంచి పక్కన సర్దుకున్నాను. కండక్టరు సుబ్రమణ్యం నవ్వుతూ పలకరించాడు - పాపం ఈ మధ్యే సర్వీసులో చేరాడు. ఆశాజీవి - 'గన్నవరం - గన్నవరం' అంటూ అరుస్తున్నాడు.

ఏడుగురితో బస్సు డిపోనుంచి కదిలింది. మా కంటె ముందుగా దాదాపు మూడు నాలుగు ఆటోలు వెళ్లిన సూచనగా, బస్సంతా ఖాళీగా ఉంది - మా బస్సుల్లో ఎక్కాల్సిన జనాన్ని గేలంవేసి పట్టుకుపోతున్న ఆటోలు శనిగ్రహాల్లా కన్పిస్తున్నాయి. కసిగా ఏక్సిలేటరు తొక్కాను. "కాస్త నిదానం మూర్తిగారూ ! అసలే ఎవడు ఎక్కట్లేదు" గొణిగాడు సుబ్రమణ్యం ! మా వేగానికి పాసింజర్లు 'మిస్సవుతారని అతగాడి భయం' 'పిచ్చివాడా' ఎక్కాల్సినోళ్లంతా ఆటోల్లోనే వున్నారు - నీ బస్సులో ఎక్కేదెవడు? మనసులో అనుకున్నాను.

సెంటర్లో మళ్ళీ పదిహేను నిముషాలు వెయిటింగు! ఎంత ఓపిగ్గా కూచున్నా దిక్కులేదు - ఆటో డ్రైవర్లు అలెగ్జాండర్లలా పోజుపెట్టి సెంటర్లో జనాన్ని ముందే పంచేసుకుని మరో రౌండు కొట్టి ముందుకు పోతున్నారు. చేతగాని వాడి కోపం ఎగదన్నింది ఉప్పెనలాగా ! ఈసురోమంటూ సాగిన బస్సుని వెనకనించి ఎవరో పాసింజరు చిన్నగా 'కామెంట్' చేశాడు. "ఇలా ఏడుస్తున్నాయి గనకే ఎవుడూ బస్సెక్కట్లేదు !" అంటూ ! ఎంత వద్దన్నా ఆ మాటలు వినబడ్డాయి చెవులకి - 'ఔనయ్యా ! పిల్లలకి ఉచితంగా పాసులు తీసుకుంటారు. పెద్దోళ్లంతా ఆటోలు ఎక్కుతారు' ఎలుగెత్తి అరుద్దామనిస్తోంది - ఆక్రోశం, కడుపుమంట క్షణక్షణానికి పెరుగుతున్నాయి.

అరగంట ప్రయాణమూ - భారంగానే గడిచింది. ఇంతలో ఒక ఆటో "కెవ్వుమనే' సినీ సంగీతం కేకలు పెడుతూ మా బస్సుని రాసుకుంటూ పోయింది. కిటికీలోంచి చూశాను. ఆటోనిండా జనం ! డ్రైవరు పక్కనా, వెనకాల సీట్లలో, రాడ్లమీదా కిక్కిరిసి కూచున్న జనం. వీపున చెళ్లున చరిచినట్లయింది. ఇందాక అంతసేపు కూచున్నా బస్సులో ఎక్కని జనం ఇంతలో ఎక్కడినుంచి వచ్చారో? మా బస్సును దాటుకుని ఆ ఆటో విజయం సాధించినట్లుగా సంగీతాన్ని రెట్టింపు చేసింది. ఏం చెయ్యాలి వీళ్లని? ఆటో వాళ్లని - జనాలని - డి.ఎం. నీ - ఏం చెయ్యాలి? బుర్రలో హోరు తుపానుగా మారింది.

నా చేతకాని కోపం ఒక భయంకరమైన ఆలోచనకి రూపమిచ్చింది క్షణాల్లో అమలు చేశాను - బండిని ఫోర్తు గేర్లోనే ఉంచి ఏక్సిలేటరు బలంగా తొక్కాను. బస్సు బాణంలాగా దూసుకుంది - పెరిగిన వేగానికి బస్సులో ఏడుగురు జనమూ ఒక్కసారి తూలారు - సుబ్రమణ్యం దగ్గరికి వస్తూ ఏదో చెబుతున్నాడు. బుర్రలో తుఫాను హోరు పెరిగిపోయింది... ఏదీ వినబడట్లేదు... బాణంలాగా పోతున్న బస్సు ఆటోకి చేరువైంది - 'కెవ్వుమనే సినిమా సంగీతం, బైటకి కనిపించే కాళ్లూ, చేతులూ.... నాలో తుఫాను హోరు ఉప్పెనయింది... రెండే రెండు సెకన్లు... బస్సు దూసుకుంటూ పోయి ఆటో వెనక భాగాన్ని ఒక తోపు తన్నింది. కాళ్లూ చేతులూ అదుపు తప్పుతుండగా కీచుమంటూ బ్రేకుని మొదలంటా నొక్కేశాను. మసకబారుతున్న కళ్లకి చివరిసారిగా కనిపించిన దృశ్యం. గాల్లోకి ఎగిరి కింద పడబోతున్న ఆటో! ... బహుశా నేను చేసింది పాపమే కావచ్చు..... దుప్పటితీసి చూసేటప్పటికి అంతా చీకటి ! ఓహో ఇదంతా కలన్నమాట ! అని వాస్తవ ప్రపంచంలో అడుగుపెట్టాను.

# చిన్న కథల్లో మానవీయ కోణం

డాక్టర్ చల్లా శ్రీరామచంద్రమూర్తి, తెలుగు శాఖ

"లేచిన వేళ బాగుంది ఇవాళ అంతా మంచే జరుగుతుంది" అని కొందరు, "లేచిన వేళ బాగోలేదు ఈ రోజు అన్నీ ఇబ్బందులే వస్తున్నాయి" అని మరికొందరు, "ప్రొద్దుటే నిద్రలేచిన వెంటనే ఎవరి ముఖం చూసానో ఏమోకాని తేలిగ్గా పూర్తవ్వాల్సిన పనులు కూడా వెనుకబడిపోతున్నాయి" అనో చాలామంది అనుకోవటం మనం నిత్యం గమనిస్తూనే ఉంటాం. ఈ నానుడి గొప్పతనాన్ని గుర్తించే కాబోలు ఉత్తమ కథానిక రచయిత పురస్కారాన్ని అందుకున్న పెద్దిభొట్ల సుబ్బరామయ్య అనే కథకుడు లేచినవేళ... చింపిరి వంటి కథలు వ్రాశారు. వందలాది కథలు వ్రాసి మంచి గుర్తింపు పొందిన సుబ్బరామయ్యకు రావిశాస్త్రి అవార్డు కూడ లభించింది. ఈయన కలంనుండి వెలువడ్డ 'లేచిన వేళ.., చింపిరి' అనే చిన్న కథల పరిశీలనమే ఈ వ్యాసం.

విజయవాడ రైల్వే స్టేషను లోపల అల్లరి చిల్లరగా తిరుగుతూ అనాథ పిల్లలుగా ముద్రపడ్డ నలుగురి పిల్లల జీవన చిత్రణలోని మానవీయణం ఈ రెండు కథల్లో కనిపిస్తుంది. రెండు కథలూ వేర్వేరు సందర్భాల్లో మలచినవైనా వస్తువులో ఏకసూత్రం చూడగలం. 8 నుండి 10 సంవత్సరాల వయస్సున్న కోటి, చింపిరి, నిప్పుకోడి, బుజ్జెమ్మ స్నేహితులు. కలసిమెలసి తిరుగుతూ సొంత చీపుళ్ళు చేత్తోపట్టుకుని దూరప్రాంతాలకు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైలు బోగీల్లోకి ప్రవేశిస్తారు. పెట్టెల్లోపల మోకాళ్ళతో పాకుతూ వీలైనంతగా రైలు పెట్టెల్ని శుభ్రం చేస్తారు. సాయంత్రం వేళ రెండున్నర రూపాయల విలువైన భోజనం ముగించుకుని ఖర్చులు పోగా మిగిలిన డబ్బులు పంచుకుని ఏదో ఒక ప్లాట్‌ఫాం మెట్లక్రింద మూలగా ఒదిగి నిద్రపోవడం వీళ్ళ దినచర్య.

కోటిగాడిలో కోరికలు కోటికి పైగానే ఉన్నాయి. చింపిరి పేరుకు తగ్గట్టు నీటుగా ఉండకపోయినా తిండి మాత్రం దండిగ లాగిస్తాడు. నిప్పుకోడి అనేది వాడికి కొసరు పేరు. అసలు పేరేమిటో వాడికే తెలీదు. తోక తొక్కిన తాచులా బుసలు కొడుతూ తోటివాళ్ళపై కసురుకోవడం ఎక్కువ. బుజ్జమ్మ తెలివైన ఆడపిల్ల. ముగ్గురు స్నేహితుల్ని తనకున్న చాకచక్యంతో సమన్వయపరుస్తూంటుంది. ఎక్కడినుండి ఎప్పుడు వచ్చారో, తల్లిదండ్రులెవరో, సొంత ఊరేదో నలుగురికీ తెలియకపోవడం అనే దిగులే ఈ నలుగుర్ని పొరపొచ్చాల్లేని మిత్రులుగ కూర్చింది.

తనని తాను సినీ తారలా భావించుకుంటుంది బుజ్జెమ్మ. కొంత కాలంగ నలుగుర్ని గమనిస్తున్న పత్రికా విలేఖరి ఒకాయన వీళ్లని ఇంటర్వ్యూ చేశాడు. తమ గురించి పేపర్లో రాస్తానన్నాడు. తమ జీవితాలు కొంత మెరుగయ్యేలా చేస్తానన్నాడు. ఫోటోలు కొన్ని తీసుకున్నాడు. చింపిరి జుట్టుతో చీమిడి కారే ముక్కుతో బుజ్జమ్మ సినీ తారలా పోజు యిచ్చింది.

లేచిన వేళ అనే కథలో సాయంకాలం పినాకిని బండినుండి డ్యూటీ దిగి నలుగురూ మంచినీళ్ళు తాగడానికి పంపు దగ్గర మూగారు. అనుకోని ఉపద్రవం పోలీసుల రూపంలో వచ్చి వాళ్ళని లాఠీలతో బాదే ప్రయత్నం చేస్తూండగ

తలోదారి పారిపోయారు. కోటిగాడి వీపుపై పడ్డలాఠీ దెబ్బ చాల బాధపెట్టింది. ఈ కథలో కోటిగాడు పడ్డ బాధ వర్ణనాతీతం. శవాల తాలూకు బంధువులు వెదజల్లిన చిల్లర నాణేలకోసం, ధనవంతుని కారు తుడిచి రూపాయి సంపాదించడంలాంటివి వీడు పడ్డ కష్టాల్లో భాగాలే. లాఠీ దెబ్బ బాధిస్తోంటే, కడుపులో ఆకలి కాల్చేస్తోంది. ధనవంతుడు ఇచ్చింది రూపాయే కాని దాన్ని విసరి క్రిందపడేలా ఇవ్వడం, బూతులు తిడుతూ మనస్తాపానికి గురి చెయ్యడం, వాచ్‌మేన్ బెదిరించడం వంటివి వాడికి బాల్యదశలో కలిగిన వేదనలు.

"ఈ కారుని నిన్నెవరు తుడవమన్నార్రా వెధవనాయాలా?" అంటూ నిస్సహాయునిపై దర్పం ప్రదర్శిస్తూ నీచంగా మాట్లాడటం పేదవాడి అణచివేత ధోరణిని గుర్తు చేస్తుంది. కష్టకాలంలో సానుభూతి చూపే స్నేహితులు దగ్గర లేకపోవడం కోటిని దిగులు పరుస్తుంది.

దేశంలో పెద్ద పెద్ద నాయకులు, ఉన్నతాధికారులు ఎంతటి నేరాలు చేసినా చిన్న శిక్షకూడా పడదు సరిగదా ! సమాజంలో దర్జాగా తిరగ్గలుగుతున్నారని, చిన్న నేరం చేసినప్పటికీ పేదవాడు పెద్దశిక్షలు అనుభవించాల్సి వస్తోందని రచయిత ఈ కథలో పరోక్షంగా సూచిస్తాడు.

పోలీసులు తమనెన్నడూ కొట్టలేదు. కాని నేడు లాఠీ దెబ్బ తినాల్సి వచ్చింది. పరమరోతగా, చెత్తాచెదారంతో అసహ్యంగా ఉన్న రైలు బోగీల్ని శుభ్రం చేస్తూ సమాజ సేవ చేస్తున్నామని కోటి తలపోస్తాడు. లైసెన్సు కూలీలకు పోటీ రావడం లేదని, దొంగతనాలు వంటి తీవ్రమైన నేరాలు చేయడంలేదని, కఠినంగా దండిచాల్సిన దోషాలు తమ నలుగురిలో లేవని కోటిగాని ఆంతర్యం. అనాథల్ని కనీసం మానవులుగానైనా చూడాలని కవి సమాజానికి ఉద్బోధ చేస్తున్నట్టుందీ సంఘటన.

ధనవంతుడి ఆకలి నక్షత్రాల హోటల్లో వందలాది రూపాయలతో తీరుతుండగా; కేవలం రెండున్నర రూపాయల్తో నిరుపేద పొట్ట నింపుకుంటున్నాడు. ధనవంతుడు ఎన్ని రకాల పదార్థాలతో భోజనం చేస్తాడో పెద్ద హోటళ్ళలో అని ప్రశ్నిస్తూ పేదవాడు అద్భుతాన్ని ప్రదర్శించడం వల్ల నేటి సమాజంలోని అసమానతలు పట్టి చూపినట్లైంది.

ఆదరంతో అచ్చమ్మ పెట్టిన అన్నంతిని స్టేషన్‌లోని ఓ మూల నక్కినక్కి పడుకున్నప్పటికీ పోలీసు వచ్చి మిగతా యెదవ నాయాళ్ళేరి అని ప్రశ్నించడం, వెకిలిగా నవ్వడం, గాయపడ్డవాణ్ణి జాలిగా చూడకపోవడం అమానుషం. అనాథలైనప్పటికీ మానవులం ఒక్కటే మానవత్వం మన తత్త్వమని తలచని అధికార మదాంధులపై కవి మానవతా వాదమనే కొరడా ఝుళిపిస్తాడు.

చింపిరి కథలో చింపిరి ముఖ్యుడు. చాలీ చాలని ఆదాయంతో సంతృప్తి చెందనివాడు. బ్రాందీషాపులో రోజుకు ఎనిమిది రూపాయలు జీతం, తాగుబోతులిచ్చే టిప్పు అదనపు సంపాదన. మొదటి రోజు బాగానే గడిచింది.

రైలు పెట్టె శుభ్రం చేయడమే నయం. రాత్రి 12 గంటలు దాటిన తర్వాత బ్రాందీ షాపు, రెస్టారెంట్‌ను తుడవడం చికాకనిపించింది. ఉమ్ములు ఆ ప్రాంతమంతా రోత గొలుపుతున్నాయి. మోకాళ్ళపై పాకుతూ శుభ్రం చేస్తున్నాడు. యజమానికి డబ్బు లెక్కించుకోవడం మీదే ధ్యాసగాని బాల కార్మికుడైన చింపిరికి మానవతా ధర్మంలో భోజనాదులు కల్పించాలనే తలంపులేదు. ఇది శ్రమ దోపిడి.

తక్కువ ఖర్చుతో ఎక్కువ శ్రమ దోచుకునే అవకాశం ఈ బాలకార్మికుల దగ్గర వీలవుతుంది. పెట్టుబడిదారుడుగా, దోపిడీదారుగానే ఇక్కడ యజమాని మనకు దర్శనమిస్తాడు.

ఇన్ని కష్టాలు ఎదురైనా ఆనందంగా అనుభవిస్తాడు చింపిరి కాని ఒక రూపాయితో సిగరెట్టు తెమ్మని కోరిన వినియోగదారునికి చింపిరి తెచ్చిస్తాడు. కాని ఆ తాగుబోతు మైకంతో, తాను రెండు రూపాయలు ఇచ్చానని సిగరెట్టు ఖర్చుపోగా మిగిలిన రూపాయి ఇవ్వాలని చింపిరిని దబాయిస్తాడు. యాగీ చేస్తాడు. బూతులు తిడుతూ తన్నడానికి వస్తే యజమాని ఏ మాత్రం పట్టించుకోడు. అది తనకు చెందని విషయంగా ప్రవర్తించడంతో నిస్సహాయుడిగా మిగిలిన చింపిరి చీదరింపుతో తన సొంత రూపాయిని తాగుబోతుకు యిచ్చి వేస్తాడు.

కష్టకాలంలో ఆదుకోని యజమాని పట్ల రోత పుట్టింది. తాను శ్రమదోపిడీకే కాక, ధనం కూడా కోల్పోవల్సిన పరిస్థితికి చలించిపోయాడు. పేదవాడి నిజాయితీకి విలువలేదని, పిల్లవాణ్ణి అనాధను బూతు మాటలతో కించపర్చడం ఇందులోని విషయాలు. అన్నిటికన్నా యజమాని నిర్లిప్తత, కార్మికుని పట్టించుకోకపోవడం, దిగజారిన మానవతా విలువలకు తార్కాణం. కనీసం మనిషిగ కూడ చింపిరి ఇక్కడ అగబడలేదు. చెప్పిన పనల్లా చేసే చిన్నసైజు యంత్రంలా ఆ షాపులో చింపిరి చూడబడ్డాడు. బాల కార్మిక వ్యవస్థపై కవి సమాజాన్ని నిలదీసిన కథయిది. మానవత్వాన్ని మంటగలిపే వారివద్ద తాను జీవించలేనని చింపిరికి అర్ధమయింది. డబ్బు సంపాదించడమే ముఖ్యంకాదనే సందేశం ఈ కథలోని కొసమెరుపు. కలసి బ్రతకడంలో పేదరికంలో కూడ ఆనందం పొందవచ్చనేది సారాంశం. తప్పు జరిగిన చోటే ప్రశ్నలతో నిలదీయాలి తప్ప, పలాయనం చేయరాదన్న మార్క్స్ భావజాలాలు చింపిరి కథలోని అంతర్గత రహస్యాలుగ చెప్పవచ్చు.

అమాయక బాలల బ్రతుకులు బుగ్గిపాలవుతున్నాయన్న నిజాన్ని పాఠకుల మనసులపై చిత్రించగలిగాడు కవి. దిగువ మధ్య తరగతి కుటుంబాలలోని వస్తువులతో కథలు రాయడం సుబ్బరామయ్య స్వభావం. కథన శిల్పంలో చాతుర్యం ప్రత్యేకత ఈయన లక్షణాలు. నిత్యం మన కన్నులముందు కదలాడే పాత్రల్ని ఎంచుకుని కథలుగా మలచగల నేర్పు సుబ్బరామయ్యకు సొంతం. చక్కని అభివ్యక్తి చూపగల ఈ రచయిత కరుణ రసాన్ని వెలయించే కథలు రచించారు.

వేచిన వేళ...... చింపిరి అనే కథల్లో ఛిద్రమవుతున్న అనాథ బాలల బ్రతుకుల్ని మానవతాకోణంలో దర్శించాలనేదే సందేశం.

# శనగన వారి 'లేఖిని' లో వాల్మీకి

నారాయణం సురేష్ బాబు - సంస్కృత శాఖ

ఆధునికాంధ్ర సాహిత్య సరస్వతి ముద్దు బిడ్డలలో శ్రీ శనగన నరసింహ స్వామిగారు ఒకరు. వీరు సంస్కృతాంధ్ర భాషలలో ప్రవీణులు. ఆంధ్ర సాహిత్య సముద్రమును మథించిన పండిత వర్యులు. వీరు అనేక కావ్యాలు రచించారు. పద్యకవితలో వీరికి వీరే సాటి. పద్యమునకు జీవం పోసినవారు శ్రీ శనగన నరసింహ స్వామిగారు.

శనగన నరసింహ స్వామిగారు 1936 లో భీమవరం తాలూకా పాములపఱ్ఱు అనే గ్రామంలో వీరాస్వామి, సుబ్బమ్మ దంపతులకు కలిగిన ఏకైక పుత్ర రత్నము. వీరి చిన్ననాటి నుండి "కష్టే ఫలి" అన్న సూక్తికి బద్ధులై, భీమవరం డి.యస్.ఆర్. కళాశాలలో, ఆంధ్ర విశ్వవిద్యాలయములో విద్య నభ్యసించి, ఆంధ్ర లొయోలా కళాశాలలో గత ముప్పది ఐదు సంవత్సరముల పాటు ఆంధ్ర శాఖలో ట్యూటర్‌గా, అధ్యాపకులుగా, శాఖాధ్యక్షులుగా పనిచేసి, 1994 మార్చి 31 వ తేదీన పదవీ విరమణ చేశారు. స్వామిగారి భావ ప్రకృతి నుండి వెలసిన కావ్యాలలో మేలు బంతివంటి, ముత్యాలు, పగడాల వంటి పద్య సమూహములతో కూర్చబడిన కావ్యాలు ఎన్నో ముద్రితములు, అముద్రితములు ఉన్నాయి. వాటిలో మచ్చుకు కొన్ని. వాల్మీకి (పద్యకావ్యం), రత్నాపాంచాలిక (నాటకము), గబ్బిలము (3 వ భాగము), శారద రాత్రులు (పద్యకావ్యం), చైత్రపరిది (పద్యకావ్యం), ఋతుసంహారం (పద్య కావ్యం), భువన విజయం మొదలైనవి. నరసింహ స్వామిగారిచే కూర్చబడి, నగిషీలు దిద్దబడిన, వాల్మీకి కావ్యమును సమీక్షించే ప్రయత్నం ఈ వ్యాసం.

శ్రీ శనగన నరసింహ స్వామిగారి "వాల్మీకి" కావ్యం కొన్ని సంవత్సరములు నాగార్జున విశ్వవిద్యాలయ కళాశాలల డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశముగా ఉన్నది. వాల్మీకి జీవిత చరితమును కావ్య రూపముగా అల్లిన కవిశేఖరులలో శనగన నరసింహ స్వామిగారు ఒకరు. స్వామిగారి వాల్మీకి కావ్యం పండితులచేత వేయినోళ్ళ పొగడబడింది. వాల్మీకి కృతి శనగన వారి కావ్య ప్రకృతి.

"ధర్మ దేవత పావన తనువు నుండి
ధరణి జాఱిన పాప పాదమ్ము మగుడ
మాన వాకృతి దాల్చిన మాద్రి వాడు
జార చోర శిఖామణి చక్రవర్తి."

వాల్మీకి వృత్తి చోరత్వం. కావున బాటసారులను దోపిడి చేసి సంసారసాగరమును గడుపుచున్నవాడు. అతడు కూడా ఒక తల్లికి పుట్టిన బిడ్డడే. కాని వాని పుట్టుకలో కొంత భేదం ఉన్నది. దీనితో అతడు ఆ అరణ్యంలో జారచోర చక్రవర్తిగా ప్రకాశించుచున్నాడు. ఎదుటి వారి హృదయమునకు హత్తుకునే విధంగా భావాన్ని వ్యక్తీకరించడంలో స్వామిగారు సిద్ధ హస్తులని వాక్రుచ్చుటకు పై పద్యమే తార్కాణము.

"పెనిమిటి చేసిన పాపం
బున భాగము లేదు చిగుర బోణికి బుణ్యం
బున సగము పాలుగలదని
వినమే చెవులార ! ధర్మవేత్తలు నుడువన్."

సప్తర్షులు వాల్మీకిని అడిగిన ప్రశ్నకు సత్యాన్వేషణార్థమై వేగంగా ఇంటికి వెళ్ళి, తన భార్యకు మునులు ప్రశ్నించిన వివరములన్ని తెలిపాడు. దానికి ఆమె ప్రతిస్పందిస్తూ ఇలా సమాధానం యిచ్చింది. "నీవు తెచ్చిన పచ్చి ఆకులను వచన క్రియ చేసి పెట్టుటయేకాని, నీవు చేసిన పాపకర్మలందు మాకు భాగం లేదు. కావున నీవుచేసిన పుణ్య కార్యములందు సగభాగముందిగాని, నీ పాపకృత్యములందు భాగం లేదని ధర్మశాస్త్ర నుడిని వినలేదా?" అని ప్రత్యుత్తరమిచ్చింది. ఈ విధంగా కథాకథన తీరును వర్ణించటంలో స్వామిగారు దక్షులు. అంతే కాకుండా పద్యమందు రామరాజభూషణుండు వలే రాగాలాపనను సాధించిన వారు. వీరి పద్యంలోని నడక అలా .... సాగిపోతూ, చదువరుల మనస్సుకు భావోద్రేకం, భావావేశం, రసానందం, భావానందం కలిగిస్తుంది.

"పులి పిల్లలు నీ కుఱ్ఱలు
కుల మెల్ల దరించు నింక గొడుకా ! యనుచున్
కుల వృద్ధులు కొని యాడం
బులకించ వో? మేను వెంచవో? మఱచితివో?"

అలా సృష్టిలయలోని పరమార్ధమును మునుల ద్వారా యెరిగినవాడై తన చోరత్వానికి భరతవాక్యం పలికి మునుల ఆజ్ఞానుసారం, సత్యాన్వేషణకై తపస్సు చేయనారంభించినాడు. దీన్ని తెలుసుకున్న అతని భార్య తన మగనిని తనకు దూరం కాకుండా చేసుకొనడానికి, వాల్మీకి తపః ప్రదేశానికి వెళ్ళింది. అందొక చోట తన భర్తను కని, ఏదో విధంగా తన భర్తను ఒప్పించి ఇంటికి తోడ్కొని వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నది. కానీ ఆ సమయానికే ధ్యాన సముద్రపు నిద్రలో మునిగిన మౌని వాల్మీకి మహర్షికి ఇవి చెవికి సోకలేదు. ఈ విధంగా భావవ్యక్తీకరణలో స్వామిగారు అగ్రగణ్యులు. ముత్యం ఎప్పటికైనా ముత్యంగానే ఉంటుందనుటకు కించిత్తు ఉదాహరణ ఇస్తాను. స్వామిగారు ఫోర్తు ఫారమ్ చదివేరోజులలో, ఆనాటి ముఖ్యమంత్రిగారైన ప్రకాశం పంతులుగారు స్వామిగారు నివసిస్తున్న ప్రక్కగ్రామానికి వచ్చిరి. కొందరి ద్వారా ప్రకాశం గారి రాకను తెలుసుకొన్న స్వామిగారు ఆ గ్రామానికి వెళ్ళడానికి నిశ్చయించుకొని, త్రోవలో నడుస్తూ, ప్రకాశం గారిమీద పద్యాలు కొన్నింటిని వ్రాసారు. ఆ పద్యాలను ప్రకాశంగారి సభలో చదివి ఆనాడే ప్రకాశంగారి ప్రశంసలకు పాత్రులైనారు శ్రీ స్వామిగారు.

సీ. జాఱుపయ్యెదలను సరిదిద్దు నెపమున బటువు గుబ్బల సొంపు బయలు పఱచి
కుసుమ గుచ్ఛములను గోయు కైతవమున బాహుమూలద్యుతుల్ బాహిరించి
ప్రియ సఖీజనమును బిలుచు వ్యాజంబున లలిత వాఙ్మాధురి వెలువరించి
కార్యార్థ మందందు గదలాడు మిషతోడ జఘున చాపల్యము జాట చేసి

తే. అలసి సొలసి వైలింపనలిన ముఖుల
కోష్ణ నిశ్వసనములగవోష్ఠ మయ్యె
మందమలయానిలంబును మౌని వరుడు
కనులు తెఱచిన జాడ యే కానరాదు !

అలా తపస్సమాధిలోనికి వెళ్ళిన వాల్మీకి రామనామ ధ్యానం అలా... అలా... దేవలోకంలోని దేవేంద్రుని చెవిన పడినది. తన పదవికి హానికలుగువేమోనని, తన నాట్యకత్తెలలో అగ్రగణ్యమైన రంభను వాల్మీకి తపస్సుకు భంగం కలిగించడానికి భూలోకమునకు ఆమె చెలులతో పంపాడు. ఆమె ఎప్పటిలాగే తనయొక్క శరీరాకృతి బయలుపరుస్తూ, తన నాట్య సౌభాగ్యము భాసిల్లే విధంగా చేస్తున్నది. కానీ ఎన్ని భంగిమలలో రంభ తన కామవాంఛను వ్యక్తపరచినా వాల్మీకి మౌని ఏకాగ్రతలో మార్పురాలేదు. ఆ రంభ భంగిమలను మన కళ్ళముందు రంభ ఉన్నట్లుగా భ్రమించే విధంగా వర్ణించుటలో స్వామిగారు సిద్ధహస్తులు. నవరసాలలో రసవంతమైన శృంగార రసమును పోషించటంలో స్వామిగారు రససిద్ధులు అనడానికి పైపద్యమే తార్కాణము. అది రసిక జనులకు ఆనందదాయకమైనది. అందువలననే, స్వామిగారు "అరసికులను ఏ విధంగానూ మెప్పించలేమని" అంటారు.

తే. పుట్ట మొలిచెనో పుట్టపై చెట్టు మొలిచి
చెట్టు పై పిట్టగమిగూండ్లు పెట్టుకొనెనొ
యెఱుగదా మౌని యిటు కొన్ని యేండ్లు గడవ
దైవికంబుగ మఱలనా దారి బట్టి.

ఆ విధంగా విముఖత చెందిన రంభ నిజలోకమునకు పోయినది. కానీ వాల్మీకి తపస్సులో ఏ విధమైన మార్పు రాలేదు. అది జరుగకపోగా, ఆ యోగ నిష్ఠలో ఉన్న వాల్మీకి తన చుట్టు పుట్ట మొలిచినదో, ఆ పుట్టపై చెట్టు మొలకెత్తినదో ఆ చెట్టుపై పిట్టలు నివాసం ఏర్పాటు చేసుకున్నవో తెలియక యోగ నిద్రలో ఉన్నవాడు. ఈ విధంగా పద్యానికి అందాలుచేకూర్చి, పద్యరచన చేయటంలో స్వామిగారు ప్రసిద్ధులయ్యారు. వృత్త్యానుప్రాసాలంకారములను, శ్లేషలను, సందర్భోచితంగా ఉపయోగించడంలో స్వామిగారు వీరికి వీరేసాటి.

తే. వనము వనమెల్ల వలమోచు విమతి చేసె
భ్రమర గాన ముఖంబున బ్రథమ కవిని
దిక్కులకు మోసికొని పోయె వాక్కు పవన
మాదిమశ్లోక సృష్టి సమార్ద గాథ

కొన్నాళ్ళకు, దైవికంగా అదే త్రోవలో పోతూ, రామనామ స్మరణం కవినవారై, సప్తర్షులు ఆ ప్రదేశమునకు చేరారు. ఆ మౌని తన దివ్యజ్ఞానంతో మునులరాకను చూచినవాడై, ధ్యాన సముద్రముమండి వెలుపలికి వచ్చి, ఆ సప్తర్షుల పాదాలకు మ్రొక్కినాడు. అప్పుడు ఆ సప్తర్షులు, ఆయన దీక్షాను వ్రతమునకు మెచ్చినవారై, దశరథ రాముని చరితమును వ్రాయుమని ఆజ్ఞాపించి వెడలిపోయారు. అలా ఆజ్ఞను గైకొన్నవాడై తన శిష్యగణముతో వన భూములందు సంచరించుచూ, కందమూలములను తింటూ, ఒకానొకచోట ఒక దృశ్యం చూచి హృదయం కలతచెందగా అనుకోని విధంగా అలవోకగా మౌని నోటనుండి శ్లోకరూపం దాల్చిన శాపం ఒకటి వెలువడినది. అదే వాల్మీకి కావ్య సృష్టికి నాందీ వాక్యం పలికి, ఆది కవిగా ప్రసిద్ధికెక్కినాడు. అలా వాల్మీకి రామాయణ కృతి ద్వారా జీవిత చరితార్థతను పొందివాడు.

శ్రీ శనగన నరసింహ స్వామి పండిత శ్రేష్టుని గురించి చెప్పడానికి నేనెంతవాడను. ఆయనొక దైవం, నేనొక భక్తుడను. ఆయనొక గురువు, నేనొక శిష్యుడను. స్వామిగారు నిరాడంబరులు, ఆడంబరాలకు అతీతులు. అందుకే పదవీ విరమణ సందర్భమున అడిగిన ప్రశ్నకు "నేను మరలా నన్నయ నుండీ నారాయణ రెడ్డి వరకు ఉన్న కవిత్వాన్ని చదవాలని ఉంది" అని సమాధానమిచ్చినారు. స్వామిగారు మన పూర్వుల గురించి చెప్పుచూ, 'వారు సింధువులు, మనం బిందువులమని' ఎంతో నిరాడంబరంగా వాక్రుచ్చినారు.

"విజయము ఘనతకు ద్రోణుని విద్యఫలము
భార్గవుని శిష్యుడయ్యె దేవ వ్రతుండు
నలిన నాభునకును గురు కులము లేదె
గురుడె బ్రహ్మ విష్ణువు, మహేశ్వరుడు భువిని"

"శనగన వంశాబ్ధి విధుడు
జనులకు కవితా మధువును చక్కగ నందిం
చిన కవి మధుపము సతతము
తన శిష్యుల మదిని దోచు ధార్మిక గురుడై"

# "వాయిదాల వ్యాధి"

యస్. బి. రవితేజా, ఆర్.బి. 95, ఆర్.నెం. 140, ఇంటర్ రెండవ సం॥ బై.పి.సి.

